## మోసపోతే గోసపడుతాం: మంత్రి



వివిధ పార్టీల నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

**బోడుప్పల్, అక్టోబర్28:** వారంటీలేని కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజల్లోకి వస్తుందని, మోసపోతే గోసపడుతామని మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం బోడుప్పల్ గ్రీన్‌సిటీ కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో వివిధ పార్టీలకు చెందిన 100మంది నాయకులు కార్యకర్తలకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న జంగయ్యయాదవ్ తన పేరునే మార్చుకున్నాడని, రేపు గెలిచాక ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా మర్చిపోతాడని విమర్శించారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేయర్ బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.



గ్రీన్‌సిటీ కాలనీ బహిరంగసభకు హాజరైన కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులు

# ప్రతిపక్షాలకు సింగిల్ డిజిటే

- బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు
- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ పక్కా
- మంత్రి మల్లారెడ్డి సమక్షంలో నాగారంలో 500మంది పార్టీలో చేరిక



మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎల్ నగర్ వాసులు



ఆర్టీసీ కాలనీలో చేరికల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి

**మేడ్చల్/ మేడ్చల్ కలెక్టరేట్ అక్టోబర్ 28:** రాష్ట్రంలో వార్ వన్ సైడే అని, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు సింగిల్ డిజిట్‌కే పరిమితమని కార్మిక శాఖా మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 4 వార్డు పరిధిలోని ఆర్టీసీ కాలనీ, ప్రశాంత్‌నగర్, ఆర్ఎల్‌నగర్, ఓయూ కాలనీ, శ్రీనివాస్‌నగర్ తదితర కాలనీలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు , వివిధ వర్గాల ప్రజలు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున శనివారం బీఆర్ఎస్ చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్ స్థానంలో నిలిపిందన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా, సాగునీరుఅందించి, రైతుల కష్టాలను సీఎం కేసీఆర్ తీర్చారన్నారు. మిషన్ భగీరథతో ఇంటింటికి నీరుఅందజేసి ఆడబిడ్డల కష్టం తీర్చిండన్నారు. ఆసరా పింఛన్‌లతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆత్మగౌరవంగా బతికేలా చేశారన్నారు.యాదవులు, మత్స్యకారులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితర వృత్తిదారులకు చేయూతనిచ్చి, ఉన్న ఊళ్లోను ఉపాధి చూపారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో మేనమామ లాగా పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రుల కష్టం పంచుకున్నాడన్నారు. దళితులను సామాజికంగా, ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు దళితబంధు అమలు చేశారని తెలిపారు. దేశంలో ఇలాంటి పథకాలు ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. బీఆర్ఎస్ కంటే ముందు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ఇంటింటికి ఎందుకు నీరు ఇవ్వలేదని, 24గంటల కరెంట్ ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేదని, ఇప్పుడు చేస్తామంటే ఎవరూ నమ్ముతారన్నారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఒక ప్రణాళిక ప్రకారం రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు.మున్సిపాలిటీలు బీఆర్ఎస్ హయాంలో ఎంతోఅభివృద్ధి చెందాయన్నారు.సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటింటికీ నీరు, వరద ముంపు నివారణకు వరద కాల్వల నిర్మాణం తదితర ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి, హ్యాట్రిక్ సాధిస్తానన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను నచ్చి, ప్రతి రోజు వందల మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ గెలుపును ఆపడం ఎవరితరం కాదని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. ఆ తర్వాత జరిగే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటి, దేశంలో చక్రంతిప్పడం కూడా ఖాయమని మంత్రి జోస్యం చెప్పారు. ప్రశాంతనగర్ కాలనీకి బీజేపీ నేత సర్వరాజ్ ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేశారు. అలాగే పలు కాలనీలకు చెందిన ప్రజలు దాదాపు 500 మంది మంత్రి సమక్షంలో చేశారు. అంతకుముందు మహిళలు మంత్రికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జహంగీర్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, నాయకులు అంజయ్య గౌడ్, రాములు, పెంటయ్య గౌడ్, సాయినాథ్ గౌడ్, రమేశ్ గుప్తా, నర్సింహారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



ఎల్ మోట్ కాలనీలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ఆయా పార్టీల నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలతో మంత్రి మల్లారెడ్డి

## పద్యనాటక రచనలో శర్మకు ప్రథమ బహుమతి



రచయిత కటకం వెంకటరామ శర్మ

మియాపూర్ , అక్టోబరు 28 : ప్రజా-పద్యం ఆధ్వర్యంలో ఆధునిక సామాజిక స్వర్ధ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్య నాటక రచన పోటీల్లో మియాపూర్ హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన విశ్రాంత మండల విద్యాధికారి, ప్రముఖ కవి, రచయిత కటకం వెంకటరామ శర్మకు ప్రథమ బహుమతి లభించింది. తెలుగు భాషాభివృద్ధికి పాటుపడుతున్న ప్రజా-పద్యం సంస్థ ఈ పోటీలను ఈ ఏడాది జనవరిలో నిర్వహించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 100 వరకు ఎంట్రీలు వచ్చాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన నిర్వాహకులు, 21 ఎంట్రీలను పరిగణనలోకి తీసుకున్నారు. వాటిని లోతుగా అధ్యయనం చేసిన న్యాయ నిర్ణేతలు ఏసీపీ శాస్త్రి, మత్తి భానుమూర్తి, అవసరాల వెంకట్రావ్ విశ్రాంత విద్యాధికారి కటకం వెంకట్రామ శర్మ రచించిన 'బృహన్నర' నాటకం ఉత్తమమైన రచనగా గుర్తించారు. ఆదివారం కూకట్‌పల్లిలోని భారత వికాస పరిషత్ ఛారిటబుల్ ట్రస్ట్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో శర్మకు బహుమతితోపాటు రూ. 5 వేల నగదు ప్రోత్సాహకంగా అందివ్వనున్నారు. శర్మను ప్రజా పద్యం నిర్వహకులు నారుమంచి వెంకట అనంతకృష్ణ, మారేపల్లి వెంకట పట్వర్థన్, వీఆర్ గణపతి సహా పలువురు రచయితలు అభినందించారు.

## అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి..

కొండాపూర్, అక్టోబర్ 28 : అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం కార్పొరేటర్ స్థానిక ఎమ్మెల్యే కుమారుడితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న అరెకపూడి గాంధీని ముచ్చటగా మూడోసారి గెలిపించాలని ప్రజలను కోరారు.

## పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం




రక్తదాన శిబిరంలో పాల్గొన్న కమాండెంట్ సన్నీ

కొండాపూర్, అక్టోబర్ 28 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కొండాపూర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీ. సన్నీ అన్నారు. పోలీసు వారోత్సవాల్లో భాగంగా శనివారం కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ.. కొవిడ్ అనంతరం రక్త నిల్వలు తగ్గిపోయాయని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. అత్యవసర సమయంలో సరైన రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ కే సుబ్రమణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు వీ. నరసింహస్వామి, డీ. సత్యనారాయణ దాసు, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి బాపులే, రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ జనార్దన్, బెటాలియన్ అధికారులు ఉన్నారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, అక్టోబర్ 28 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాండవ ఆర్ట్స్ కూచిపూడి డాన్స్ అకాడమీ గురువులు మధుసూదన్ తన శిష్య బృందంతో కలిసి కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చారు. తాండవ నృత్యకారి, శివాష్టకం, భామాకలాపం, జయదేవ అష్టపది, గజవదన బేడువే, శివరంజని తిల్లాన, ఆధ్యాత్మ రామాయణ కీర్తన, ఆనంద తాండవం, జయము జయము లలితకలవానికి, దేవదేవం భజే, మరకత మణిమయ అంశాలను అద్వైత, వైష్ణవి, సాత్విక, రిత్విక, శుక్తాచారి, సునీతలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించిన తీరు ఆకట్టుకుంది.

